# కిడ్నాప్ - కిడ్నాప్

నన్ను చూడగానే ఏసీపీ బలరాం కౌగలించుకున్నంత పనిచేశాడు. "ఆహా, ఏమి అదృష్టం! తమిళం తెలుసున్నవాడు ఎవడాని చూస్తున్నాం. పిలిచినట్టు వచ్చావ్, రా వచ్చి టీవీ చూసి వాడేమంటున్నాడో చెప్పు!" అంటూ.

"ఏదో చిన్నప్పటి క్లాసుమేటు కదా, ఇంట్లో ఎలాగూ దొరకవు అని ఆఫీసుకి వస్తే టీవీ చూడమంటావేమిట్రా. సాయంత్రానికి రైలెక్కి మా ఊరెళ్లిపోవాలి. అంత తీరికేం లేదు" అంటూనే కూలబడ్డాను.

"టీవీ చూడమనేది పాటలు, గంతులు చూడమని కాదోయ్ మహానుభావా! మా తలకు దేవరాజన్ కిడ్నాప్ కేసు చుట్టుకుంది. తమిళ నటుడు కదా. సన్ టీవీలో ఏవైనా వివరాలు చెప్తాడేమో విందాం అని టీవీ పెట్టాం కానీ ఒక్క ముక్క అర్థం కావటం లేదు. తమిళనాడులో ఇరవై ఏళ్లు పనిచేసి వచ్చావు కాబట్టి అది విని మాకు అచ్చ తెలుగులో చెప్తావేమోనని..."

"పేపర్లో చూసాను. దేవరాజన్‌ను అనంతపురంలో కిడ్నాప్ చేసారని. రెండు కోట్లు రేన్సమ్ అడిగేరటగా! వాళ్ల పనివాడు హిస్టీరియా వచ్చి పడిపోతే హాస్పటల్లో చేర్చారట. అయినా ఎక్కడో అనంతపురంలో జరిగితే హైదరాబాదులో మీకెందుకు..."

"...హెడ్‌క్వార్టర్స్ కదోయ్, మాకే అన్ని తలకాయనొప్పులూను. అయినా ఎక్కడో అరవ్వాడు కదా, ఇంకేదీ దొరకనట్టు అనంతపురంలో కొత్త ఇల్లు కొనడం ఏమిటి, ఆ ఉరుము ఉరిమి మా మంగలం మీద పడడమేమిటి?"

"కన్నడ నటుడు రాజ్‌కుమార్ కూడా తమిళనాడులో ఇల్లు కట్టుకుని అక్కణ్ణుంచే కిడ్నాప్ అయిపోయాడుగా. అలాగే ఈ దేవరాజన్ కూడా నేమో! వాస్తు సరిగ్గా చూసుకోవటం లేదేమో! ఇంటియజమాని కిడ్నాప్ అవకుండా ఉండాలంటే సింహద్వారం ఇలా ఉండాలి అని పండితులు ఇప్పణ్ణుంచి కాన్వాస్ చేసుకోవాలేమో!" అన్నాను నవ్వుతూ.

సమాధానంగా బలరాం ఏదో అనబోతూండగానే సన్ టీవీలో ప్రకటన వచ్చింది - ఇంకో పావుగంటలో దేవరాజన్‌పై ప్రత్యేక కార్యక్రమం అని. ఈలోపున దేవరాజన్ అంత పెద్ద నటుడా? అతని సంగతులు చెప్పు అని బలరాం నన్ను అడగడం, కిడ్నాప్ వివరాలు చెప్పు అని అతన్ని నేను అడగడం జరిగేయి.

దేవరాజన్ ఒకప్పుడు ప్రఖ్యాత తమిళహీరో. శివాజీ, ఎంజీఆర్ లెవెల్లో ఉండేవాడు. వయస్సు పెద్దదయిన తర్వాత క్యారెక్టరు పాత్రలకు మారలేదు. అంతకంటే రిటైరవ్వడమే మంచిదనుకున్నాడు. పబ్లిక్‌లోకి పెద్దగా రాడు. మద్రాసులో పెద్ద బంగళా. అభిమానులు కూడా రావడం మానేశారు. అతని పూర్వీకులు అనంతపురం వాళ్లో, లేక అక్కడి వాతావరణం అతనికి నచ్చిందో, అక్కడ కొత్త ఇల్లు ఒకటి కొన్నాడు. ఫ్యామిలీని తీసుకెళ్లలేదింకా. ఇతను ఒక్కడే వెళ్లి పనివాళ్లను వాళ్లను ఏర్పాటు చేసుకున్నాడు. ఇతను ఇల్లు ఏర్పాటు చేసుకుంటూండగానే ఎవరి దగ్గర్నుంచో బెదిరింపు ఉత్తరం వచ్చింది, ఎత్తుకుపోతాం జాగ్రత్త అని. కన్నడ హీరో రాజ్‌కుమార్ అనుభవం దృష్టిలో పెట్టుకుని పోలీసులకు కబురంపించాడు, వాళ్లు కాక ప్రైవేటుగా కూడా ఒక ఏజన్సీని నియమించాడు.

"వాళ్లు కూడా మీ పోలీసులంత సమర్థులేనన్నమాట!" అన్నాను వెక్కిరింతగా.

"అలా తీసిపారేయకు. అసలు ఎలా కిడ్నాప్ అయ్యాడో పెద్ద మిస్టీరియస్‌గా ఉంది. దేవరాజ్ ప్రైవేట్ ఛాంబర్, సెకండ్ ఫ్లోర్‌లో ఉందిలే, దానిలో ఉన్నవి - ఒక డ్రాయింగ్ రూమ్, ఒక బెడ్‌రూమ్, బాత్‌రూమ్. అంతే! వాటిమీద, వాటి కిటికీల మీద గార్డ్‌ల నిఘా ఉంది. ఆ రూమ్స్‌లోకి వచ్చేందుకు పనివారెవరికీ అధికారం లేదు. అక్కన్న అనే ఒక ముసలి పనివాడొక్కడే ఆయనతో ఉన్నాడు. అసలు దేవరాజన్ ఆ సారి అనంతపురం వచ్చిందే మధ్యాహ్నం! సాయంత్రం నాలుగున్నరకు అక్కన్న కాఫీ ఇచ్చాడు. అది తాగి బెడ్‌రూమ్‌కు వెళ్లాడు. ఆరున్నరకు లేపమన్నాడు. లేపడానికి అక్కన్న వెళితే మనిషి లేడు. జస్ట్, హుష్‌కాకీ అయిపోయాడనుకో!"

"అలా ఎలా అవుతాడు? ఎవరైనా మోసుకుని వెళ్లడమో, బెదిరించి నడిపించుకుని వెళ్లడమో జరగాలిగా! తక్కిన పనివాళ్లెవర్నయినా కనుక్కోలేక పోయావా? వాళ్లు చూసి ఉంటారు."

"తక్కిన వాళ్లెంతమంది కనుక? వంటవాడు, ఊడ్చేవాళ్లు మొత్తం నలుగురు. వాళ్లయినా దేవరాజన్ సెక్రటరీ లోకల్‌గా రిక్రూట్ చేసినవాళ్లు. వాళ్లకి దేవరాజన్‌ను సరిగ్గా తెలియను కూడా తెలియదు. అందులో మీ అరవ యాక్టర్లందరికీ నల్లకళ్లజోళ్లు అలవాటుగా! అసలు ఎంజీఆర్ ఎలా ఉంటాడో పోయాక కూడా తెలియలేదు. ఆ నల్లకల్లజోడు, ఫర్ క్యాప్‌తోనే సమాధి చేసేసారు. అలాగే ఈ దేవరాజన్నూనూ, అతన్ని సరిగ్గా చూసి, గుర్తుపట్టగలిగే వాడెవడ్రా అంటే ఆ అక్కన్నగాడు. కానీ వాడు కళ్లు తేలేశాడు. దేవరాజన్‌ను ఎవరో ఎత్తుకుపోయారని తెలియగానే స్పృహ తప్పి పడిపోయాడు. అసలు వాడు ఉద్యోగంలో చేరిందే ఆరోజు! అవాళే ఈ ఉపద్రవం. దెబ్బకి భయపడిపోయినట్టున్నాడు. హాస్పటల్లో వాడికి తెలివి వచ్చాకనే పూర్తి వివరాలు తెలుస్తాయి."

"మీ అనంతపురం స్టేషన్ వాళ్లేమంటారు?"

"ఏమంటారు? ఇంత పబ్లిసిటీ రావడంతో భయపడుతున్నారు. రాజకుమార్ కిడ్నాప్‌లాగానే ఇదీ దేశమంతా తెలుస్తుందేమో, సరిగ్గా చేయకపోతే చివాట్లు పడతాయని భయపడుతున్నారు. గదుల ప్లానూ అదీ గీసి పంపమన్నాను. దేవరాజన్ ఎలా మాయమయ్యాడో గెస్ చేద్దామని. టీవీ వాళ్లు ఇంట్లోకి దూరిపోయి ఆ గదులు అవీ ఫోటోలు తీయబోతూంటే, ఫుట్‌ప్రింట్స్ అవీ చెదిరిపోతాయని ఇల్లు తాళం వేసేసేరు."

"కిడ్నాప్ చేస్తామని బెదిరిస్తూ రాసిన ఉత్తరం బట్టి ఏమైనా తెలిసిందా?"

"ఆ ఉత్తరం మీద ఏ సంతకమూ లేదు. అసలు పబ్లిసిటీ స్టంట్ కోసమే ఈ దేవరాజన్ కిడ్నాప్ నాటకం ఆడుతున్నాడేమోనని అనుమానమొచ్చింది నాకు."

"చాల్లే, దేవరాజన్‌కి పబ్లిసిటీ ఎందుకు? మళ్లీ సినిమాల్లో వద్దామనుకునే వాడికి కావాలి. అతను వయస్సు మీరుతుండగానే సినిమాలు మానేశాడు. చాలామంచి యాక్టర్ తెలుసా? చాలా నేచురల్‌గా చేసేవాడు. అసలతను బయట ఫంక్షన్స్‌కి కూడా రాడు. ఈ మధ్య అతన్ని చూసినవాళ్లే లేరు. అలాటివాడు ఇలాటి పబ్లిసిటీ వల్ల పొందే లాభం ఏం ఉంది?" అని నేను వాదిస్తూండగానే సన్ టీవీ కార్యక్రమం ఆరంభమయింది.

దేవరాజన్ సినిమాల నుండి క్లిప్పింగ్స్ చాలా చూపించారు. అతని సహచరుల స్టేట్‌మెంట్స్, కుటుంబసభ్యుల, అభిమానుల ప్రార్థనలు - అన్నీ చూపించారు. కిడ్నాపర్‌లు తమ డిమాండ్ గురించి సన్ టీవీ వాళ్లకే తెలియబరచారట. ఇప్పటిదాకా వాళ్లెవరో ఒక అంచనాకు కూడా రాలేకపోయారట.

దేవరాజన్ అంతర్ధానం గురించి మరిన్ని వివరాలు చెప్పారు. దేవరాజన్ డ్రాయింగ్‌రూమ్ బయట ఉన్న కారిడార్‌లో సెక్యూరిటీ గార్డ్ ఉన్నాడు. అతను దేవరాజన్, అక్కన్న సాయంత్రం నాలుగున్నరకు మాట్లాడుకుంటూ ఉండగా విన్నాడు. అక్కన్న బయటకు వచ్చేశాక ఎవరూ లోపలి నుండి బయటకు రాలేదు. బయటనుంచి లోపలికి వెళ్లలేదు. అక్కన్న ఆరున్నర ప్రాంతంలో మళ్లీ వచ్చి తలుపుతట్టి లోపలికి వెళ్లినప్పుడు కూడా ఆ గార్డే డ్యూటీలో ఉన్నాడు. అక్కన్న తలుపుతట్టడం, లోపలకు వెళ్లి దేవరాజన్ సార్ లేడని కేకపెట్టడం జరిగింది. ఆ వెనక్కాలే గార్డు కూడా వెళ్లి చూసాడు. డ్రాయింగ్‌రూమ్

ఖాళీ. ఆ గది నుండి మూడు గుమ్మాలున్నాయి. ఒకటి కారిడార్‌కి. అక్కడి గార్డు కదలనేలేదు. ఇంకోటి టాయిలెట్‌కి, దానికి కిటికీ తప్ప మరేమీ లేదు. ఇంకోటి బెడ్‌రూమ్‌కి. దానికి అవతలివేపు గోడ తప్ప మరేమీ లేదు. దేవరాజన్ ఎలా మాయమయ్యాడో ఎవరూ ఊహించలేకుండా ఉన్నారు.

వీటన్నిటితో బాటు ప్రజల రియాక్షన్ కూడా చూపారు. వారిలో ఒక వీడియో వ్యాపారస్తుడు చెప్పిన ఒక విషయం ఇంట్రస్టింగ్‌గా ఉంది. రాజ్‌కుమార్ కిడ్నాప్ అయిన తర్వాత ఆయన సినిమా క్యాసెట్లకు గిరాకీ పెరిగి, అమ్మకాలు ఒక్కసారిగా పెరిగాయట. అలాగే దేవరాజన్ సినిమా క్యాసెట్ల గురించి కూడా అందరూ అడగనారంభించారట.

అవన్నీ అనువదించి చెప్పేసరికి బలరాం పకపక నవ్వాడు, "పోన్లే, ఈ కిడ్నాప్ ఎవరికో ఒకరికి లాభించింది" అంటూ. ఈలోగా రూమ్‌ల ప్లాను ఫ్యాక్స్‌లో వచ్చింది. అది ముందు వేసుకుని కూచున్నాం. ఎటునుండి చూసినా మనిషిని ఎత్తుకుపోయేందుకు ఏ మార్గమూ కనబడలేదు. కారిడార్‌లో ఉన్న సెక్యూరిటీ గార్డుని ఎవరైనా లోబరుచుకుంటే తప్ప! దానికి ఛాన్స్ చాలా తక్కువ అన్నాడు బలరాం.

"అసలు అక్కన్నను అనుమానించాలి" అన్నాను నేను. "అతను పనిలో చేరిన రోజే ఇది జరిగింది. అతను కిడ్నాపర్ల తాలూకు మనిషేమో!"

బలరాం ఒక్క ఉదుటున లేచాడు. "కరక్టుగా చెప్పావ్. వాడి సంగతి కనుక్కుందాం" అంటూ అనంతపురం ఎస్.ఐ.కు, ఆయన ద్వారా అక్కన్నకు ఎడ్మిట్ చేసిన హాస్పిటల్‌కు ఫోన్ చేశాడు. డాక్టర్‌తో మాట్లాడుతూండగానే అతని మొహంలో రంగులు మారాయి. ఫోన్ పెట్టేసాక, నుదురు కొట్టుకున్నాడు – "అసలు నేను ముందే ఊహించవలసింది. ఆ రోజే పరిచయమైన దేవరాజన్ కిడ్నాప్ అయితే అంత ఇదిగా రియాక్ట్ కావడం అనేది పెద్ద నాటకం అని తెలుసుకోవల్సింది. ఛ!"

"ఏమయింది?"

"ఏమవుతుంది? వాడు హాస్పిటల్ నుండి పారిపోయాట్ట. ఎక్కడా ఫికరు లేదు. డాక్టరు ఆ మూర్ఛ కూడా నిజం కాదేమోనన్నాడు. నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. వాడు కిడ్నాపర్ల తాలూకు మనిషి. ఉద్యోగం అంటూ దేవరాజన్ దగ్గర చేరాడు. లోపల నుండి తలుపులు తెరిచిపెట్టి వాళ్ల మనుష్యులు దేవరాజన్‌ని ఎత్తుకుపోయేందుకు సహకరించాడు."

"నాలుగున్నరకు వాళ్లిద్దరూ మాట్లాడుకోవడం తెరిచివున్న తలుపు ద్వారా సెక్యూరిటీ గార్డు విన్నాడు. ఆ తర్వాత అతను కారిడార్ నుండి కదలలేదు.." అంటూ అడ్డు చెప్పబోయేను.

"మైడియర్ ఫ్రెండ్! నీకు పోలీసుబుర్ర లేదు. ఆ గార్డు మాటలు విన్నాడు కానీ మనుష్యుల్ని చూడలేదు. నాలుగున్నరకు ముందే అక్కన్న గారు దేవరాజన్‌ను మాయం చేసేసి ఉండవచ్చు. ఆ తర్వాత వాడే గొంతుక మార్చి రెండు రకాలుగా మాట్లాడి ఉండవచ్చు. అలా టైము విషయంలో మనందరినీ తప్పుదారి పట్టించి ఉండవచ్చు. నాలుగున్నరకు ముందు గార్డు లేని టైములేమిటో తెలుసుకుంటే మనం ముందుకు సాగవచ్చు."

"కారిడార్ గార్డు లేకపోయినా బయటవాళ్లు ఉన్నారు కదా! అందుచేత దేవరాజన్‌ను ఇంట్లోంచి బయటకు తప్పించడం కష్టం. అందుచేత అతనికి స్పృహ తప్పించి, ఇంట్లోనే ఎక్కడో దాచేసి, గగ్గోలు పెట్టి మనందరి దృష్టి మరల్చడానికి తను మూర్ఛపోయినట్టు నటించి ఉంటాడు అక్కన్న. ఆ తర్వాత వచ్చినవాళ్లెవరో దేవరాజన్‌ను తరలించేసి ఉంటారు" అన్నాను నేను.

"అసలు అక్కన్న గురించి టీవీలో ఏం చెప్పాడు చెప్పు విందాం" అన్నాడు బలరాం.

"ప్రత్యేకంగా ఏమీ లేదు. అతని గురించి ఎవరికీ తెలియదు. పొద్దున్న దేవరాజన్ వంటవాడి దగ్గరకు వచ్చి 'సార్ నన్ను పనిలోకి పెట్టుకున్నారు, ఇవాళ రమ్మన్నారు' అంటే మేడమీదకు పంపించేరట. క్రిందకు వచ్చి పళ్ల రసాలు, కాఫీలు పట్టుకెడుతూనే ఉన్నాడట. మధ్యాహ్నం భోజనం పట్టుకెళ్లాక సాయంత్రం టీ ఆరున్నరకు ఇమ్మన్నారని అన్నాడట. అది పట్టుకుని వెళితేనే కిడ్నాప్ సంగతి తెలిసింది. అతని ఫోటోనూ లేదు, ఇంటి అడ్రసూ తెలియదు" అని చెప్పాను.




"ఈ అక్కన్నే కింగ్‌పిన్, లెట్‌మీ టెల్ యూ" అంటూండగానే బలరాంకు ఛట్టున ఐడియా వచ్చింది. దేవరాజన్‌ను ఇంట్లోనే దాచి ఉంటాడని. అనంతపురాని ఎస్.ఐ.కి ఫోన్ కొట్టాడు. "చంద్రం, లిజన్. వెంటనే దేవరాజన్ ఇంటికి వెళ్లు. అతని బెడ్‌రూమ్‌లో మంచంలో, అదేనయ్యా బాక్స్‌టైపు మంచాలు వస్తున్నాయి కదా, దుప్పట్లూ అవీ దాచుకోవచ్చు, అలాటివి. ఈయన సినిమా యాక్టర్ కాబట్టి నోట్ల కట్టలు దాచుకోవడానికి అటువంటివి చేయించి ఉంటాడు. పరుపులెత్తి ఆ మంచంలో చూడు... ఎందుకా? ...ఎందుకేమిటి? యూ మే ఫైండ్ దేవరాజన్ దేర్. ఈ అక్కన్న స్కౌండ్రల్. వాడే దేవరాజన్‌కి మత్తుమందు ఇచ్చి ఇంట్లోనే దాచేశాడు. అక్కడ లేదని అల్లరి పెట్టేసి, హడావుడి చేశాడు. మన బోయ్స్, ఈజీగా మిస్‌లీడ్ అయిపోయివుంటారు. నేను చెప్పినది వెతికి ఉండరు. ఇల్లంతా గాలించాం సార్ అంటారు. నువ్వే పర్సనల్‌గా వెళ్లు."

అతని జవాబు వచ్చేలోపున హాస్పటల్‌కి ఇంకోసారి ఫోన్ చేసాడు బలరామ్. ఫోన్ పెట్టేసాక నిట్టూర్చి, "నేను ముందే అనుకున్నా ఈ అక్కన్న గాడిని పట్టుకోవడం అంత సులభం కాదని. రిమార్కబుల్‌గా ఉండే గుర్తులేవీ లేవు. డెబ్బై ఏళ్ల ముసలాడు. బట్టతల, మీసం, గడ్డం లేవు. సన్నగా, పొడుగ్గా, కాస్త వంగి నడుస్తాడు. ఇలాటి వాళ్లు అడుక్కి డజన్‌మంది కనబడతారు. మాఫియా వాళ్లు ఇలాటి ఆపరేషన్స్‌కి ఇటువంటి వాళ్లనే సెలక్ట్ చేసుకుంటారు" అని విసుక్కున్నాడు.

మేం భోజనం చేసి వచ్చేసరికి అనంతపురం నుండి కబురు వచ్చింది. బలరాం ఐడియా ఘోరంగా దెబ్బతింది. దేవరాజన్ ఇంట్లో ఎక్కడా లేడుట. "ఆ సెక్యూరిటీ గార్డుల మీదే నా అనుమానం. అసలు దేవరాజన్‌ను లాస్ట్‌టైము ప్రత్యక్షంగా చూసినదెప్పుడో కనుక్కుని, అప్పణ్నుంచి మారిన గార్డులందరినీ చెక్ చేయాలి. అసలు పొద్దుణ్నించి ఏదో ఒక కారణం మీద ఎవర్నైనా బయటకు తీసుకెళ్లారేమో, లేకపోతే పెద్ద, పెద్ద వస్తువులు, పెట్టెలు తీసుకెళ్లారేమో చూడాలి" అంటూ నేను ఐడియాలు ఇచ్చేస్తూ ఉండగానే బలరాం ఏదో ఆలోచిస్తూ మద్రాసుకి ఫోన్ కొట్టాడు.

దేవరాజన్ కొడుకు లైన్లోకి వచ్చాడు. మామూలు సానుభూతి మాటల తర్వాత బలరాం అడిగేడు, "వాళ్లడిగిన డబ్బు విషయం ఏం చేస్తున్నారు?" అని. "ఏం చేస్తాం? నాన్నగారి కంటే ఏదీ ఎక్కువ కాదు కదా! మా ప్రాపర్టీ ఏదో ఉంది. అయినకాడికి దాన్ని అమ్మేసి డబ్బు ఏర్పాటు చేస్తున్నాం. ఫాదర్ ఫ్రెండు ఒకాయన ముందుకొచ్చారు" అన్నాడతను.

'సారీ' అంటూనే, 'ఇంకో చిన్న విషయం, పర్సనలే అనుకోండి. మా ఫ్రెండొకడు వీడియో బిజినెస్‌లో ఉన్నాడు. మీ ఫాదర్ సినిమాల వీడియో రైట్స్ ఎవరి దగ్గర ఉన్నాయో కనుక్కోమని ఎప్పుడో చెప్పాడు. అడుగుదామని అనుకుంటూనే అశ్రద్ధ చేసాను. ఆ ప్రొడ్యూసర్ల లిస్టు మీ దగ్గర ఉందా?" అని అడిగాడు బలరాం.

"ఇప్పుడందరూ వాటి గురించే అడుగుతున్నారు సార్. ఇన్‌ఫాక్ట్, నాన్నగారే ఈ మధ్య తన ప్రొడ్యూసర్లందరి దగ్గర్నుంచీ వీడియో హక్కులు తీసుకుని ఆయన సెక్రటరీ చేత కొనిపించారు. జంబులింగం అని, మీరు సాయంత్రం మళ్లీ ఫోన్ చేస్తే ఇక్కడే దొరుకుతాడు. మీ ఫ్రెండుని అతనితో మాట్లాడమనండి" అని అన్నాడతను.

బలరాం ఫోన్ పెట్టేయగానే "అంత ఇంట్రస్టు ఉన్న ఫ్రెండెవడ్రా? అదీ కాక, ఇల్లు కాలి ఏడుస్తూంటే చుట్ట ముట్టించుకున్నట్టు, ఆ సినిమాల గోల ఇప్పుడే అడగాలా?" అని చివాట్లు వేయబోయాను కానీ అతను వినిపించుకోలేదు. చరచరా లోపలికి వెళ్లి ఏవో ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వచ్చి కూచుని అనంతపురం ఎస్పైకి మళ్లీ ఫోన్ కొట్టాడు.

"చంద్రం, జాగ్రత్తగా విను. అక్కన్న ఫోటో సంపాదించాను. ఎక్కణ్నుంచేవిటయ్యా? ఎక్కడో అక్కణ్నుంచి. నీకు ఈ మెయిల్ చేయించాను. దాన్ని గార్డులకు, వంటవాడికి, పనివాళ్లకు చూపించి కన్‌ఫమ్ చేసుకో ఆ తర్వాత మద్రాసు వెళ్లి దేవరాజన్ ఇళ్లు ఎక్కడెక్కడున్నాయో అన్నిచోట్లకీ, ఫామ్‌హౌస్‌తో సహా, ప్రతీచోటకీ వెళ్లు. అక్కడ దొరుకుతాడు ఈ అక్కన్న. అరెస్టు చేయించు. ఓకే"

"నీకు ఫోటో ఎక్కడ దొరికిందో అది చెప్పు ముందు" అన్నాను ఉత్సుకత పట్టలేక.

"చెప్తాను గానీ పోలీసు బ్రెయిన్ ఎలా వర్క్ చేస్తుందో ముందు శాంపుల్ చూపిస్తాను. ముందులో నేనన్నాను చూడు ఇదంతా పబ్లిసిటీ స్టంటేమోనని. దేవరాజన్‌కి సినిమాలలోకి మళ్లీ వచ్చే ఆశ లేదు కాబట్టి ఆ ఐడియా అప్పుడు కొట్టిపారేశాం. ఈ కిడ్నాప్ వల్ల దేవరాజన్ లాభపడుతున్నాడు చూడు. దీనివల్ల అతని సినిమాలకు మళ్లీ గిరాకీ ఏర్పడుతుందని పసిగట్టి – రాజ్‌కుమార్ కేసులో అదే జరిగిందిగా – వీడియో రైట్స్ కోసం వ్యాపారస్తులు ఎగబడతారు. అది ఊహించే తన సెక్రటరీ చేత ముందే కొనిపించేశాడు. అతనిదే డబ్బయివుంటుంది. సెక్రటరీ బినామీ అయి వుంటాడు."

"ఇంత చిన్న లాభం కోసం కిడ్నాప్ కావడానికి ఒప్పుకుంటాడా?" అని సందేహం వెలిబుచ్చాను.

"ఇంకోటి కూడా చూడు. దేవరాజన్ అప్పట్లోనే ఆస్తి బాగా సంపాదించి ఉంటాడు, భూమీ పుట్రా

వగైరా. అమ్మితే క్యాపిటల్ గెయిన్స్ బోల్డంత కట్టాలి. ఈ కిడ్నాప్ రేన్సమ్, రెండుకోట్ల కోసం హడావుడిగా అమ్మడంలో నష్టం వచ్చిందని చూపించి టాక్స్ బెనిఫిట్ పొందుతాడేమో, బినామీ ద్వారా మళ్లీ కొంటాడు కాబట్టి ఆస్తి ఎక్కడికీ పోదు..."

"ఐ డౌట్"

"నాకేం డౌట్ లేదు. ఈ కిడ్నాప్‌లో దేవరాజన్ హస్తం తప్పకుండా ఉంది. లేకపోతే అంత మిస్టీరియస్‌గా అంతర్థానం కావడం మానవసాధ్యం కాదు."

"అంటే దేవరాజనే కావాలని అక్కన్నకు ఉద్యోగం ఇచ్చి, అతనిచేత నాటకం ఆడించాడంటావ్?" అంటూండగానే అనంతపురం నుండి ఫోన్ వచ్చింది.

బలరాం మొహంలో వెలుగు. 'రైట్, గో ఎహెడ్. అది తీసుకుని వెంటనే మద్రాసు వెళ్లిపో. ఆల్ ది బెస్ట్" అనేశాడు.

"ఏమిటి? ఆ ఫోటో కరక్టేనా? ఎక్కణ్నుంచి సంపాదించావో చెప్పలేదు. పాత నేరస్తుల ఫోటోల్లోంచి..."

"ఆగాగు. మరీ ఎక్కువగా గెస్ చేయకు. ఆ ఫోటో దేవరాజన్‌దే!" అని ఫక్కున నవ్వాడు బలరాం.

"వ్వాట్! దేవరాజన్‌దా? అంటే అక్కన్న, దేవరాజన్ ఒక్కరేనా?" అంటూ నోరు వెళ్లబెట్టేసాను.

"ఏం ఎందుకు కాకూడదు? వాళ్లిద్దరినీ కలిసి చూసినవారెవరూ లేరు. ఆ రోజు పొద్దున్న అక్కన్న వచ్చి సార్ రమ్మన్నారని అన్నాడు. పైకి వెళ్లాడు. మధ్యాహ్నం దేవరాజన్ కార్లో టిప్‌టాప్‌గా వచ్చాడు పైకి వెళ్లాడు. భోజనం ఇద్దరూ కలిసి చేయలేదు. సెక్యూరిటీ గార్డు కూడా ఇద్దరు మనుష్యులు మాట్లాడుకోవడం విన్నాడు కానీ కళ్లతో చూడలేదు. దేవరాజన్ వంటి నటుడికి ద్విపాత్రాభినయం చేయడం కొత్తకాదు. గొంతులు మార్చి ఇద్దరు ఉన్నట్టుగా ఈజీగా భ్రమింపజేయగలడు."

"అదేవిధంగా అక్కన్నగా మూర్ఛపడిపోయినట్టు నటించడం కష్టమేమీ కాదు. సద్దుమణిగాక చల్లగా హాస్పటల్లోంచి పారిపోయాడు. కానీ దేవరాజన్‌ని ఎవరూ గుర్తుపట్టలేకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది."

"ఆశ్చర్యమేముంది? తెరమీద చూసే రూపానికి, నిజజీవితంలో ఉండేదానికి చాలా తేడా ఉంటుందిగా. దేవరాజన్‌ని తెరమీద చూసి ఇరవైయేళ్లయింది జనాలకి. ఈ బట్టతల, ముసలిరూపు ఎవడూహించగలడు? ఇల్లు కొనడానికి వచ్చినప్పుడు సూటు, బూటూ, విగ్గు, గాగుల్స్‌తో వచ్చి ఉంటాడు. అక్కన్నగా వచ్చినప్పుడు పంచె కట్టి ఒరిజినల్‌గా వచ్చి ఉంటాడు. మాజీ తమిళనటుడిని ఆంధ్రదేశంలో గుర్తుపట్టగలిగేవాడెవడు?"

"అందుకే అనంతపురం ఎంచుకున్నాడేమో! చిత్తూరయినా కొంతమంది గుర్తుపడుదురు. పైగా ఫ్యామిలీని కూడా తీసుకురాలేదు. ఏ మనవడైనా తాతా అన్నాడంటే ప్లాన్ భగ్నమయిపోతుందని. అంతా బాగానే ఉంది కానీ దేవరాజన్ ముసలితనంలో ఇలా ఉంటాడని ఎలా గెస్ చేసి ఫోటో తీయించావ్?" అని అడిగేను ఉత్సాహంగా.

"అదా?! సన్ టీవీ వారి సౌజన్యం. దేవరాజన్ మీద ప్రోగ్రాంలో అతని పాత సినిమాల క్లిప్పింగ్స్ చూపించాడుగా. అది రికార్డు చేయించాను. వాటిల్లోంచి అతని ముసలి పాత్రల గెటప్స్, బట్టతల ఉండి, మీసం, గడ్డం లేని ఫోటో ఒకటి దొరికింది."

"అమోఘమైన తెలివితేటలు, సాధారణంగా పూనుకోరు కానీ తలచుకుంటే మీ పోలీసులు అద్భుతాలు సాధించగలరు" అన్నాను అతని భుజం తట్టుతూ.

"నీ బోడి లెఫ్ట్-హేండెడ్ కాంప్లిమెంట్ నీ దగ్గరే ఉంచుకో" అంటూ ఒక్క చరుపు చరిచేడు బలరాం కాలేజీరోజుల్ని గుర్తుకుతెస్తూ.

అక్కన్న ఉరఫ్ దేవరాజన్ ఉంపుడుగత్తె ఇంట్లో పట్టుబడ్డాడు.